

సుందరీమణుల రాక కోసం..
అందాల భామల రాకకోసం సాగర్, పోచంపల్లిని అధికారుల ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.
- 8లో



భక్తుల రద్దీ
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
42° /26°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

● కదంతొక్కిన కార్మికలోకం



మే డే సందర్భంగా గురువారం కోదాడలో కాంగ్రెస్‌పార్టీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, కార్మికులు - కోదాడ



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి - హుజూర్‌నగర్

మైనింగ్ వద్దే వద్దు..

తొండ గ్రామంలో మైనింగ్ పనులు నిలిపి వేయాలని ప్రజల వేడుకోలు

- పర్మిషన్ రద్దు చేయాలని హైకోర్టుకు వెళ్లిన 42 మంది స్థానికులు
- రైతువేదిక, సెగ్రిగేషన్ షెడ్లు, ఇళ్లు, పంటలు దెబ్బతింటాయని ఆందోళన

తిరుమలగిరి (తుంగతుర్తి) : మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలని తిరుమలగిరి మండలం తొండ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులు కొందరు ఇప్పటికే హైకోర్టుకు కూడా వెళ్లారు. ఈ నేపథ్యంలో గురువారం విచారణకు వచ్చిన అధికారులను సైతం స్థానికులు కలిసి మైనింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పర్మిషన్ రద్దు చేయించాలని వేడుకున్నారు తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని సర్వే నంబర్ 98లో 168 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి తిరుమలగిరి–తొర్రూరు ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 20 ఎకరాల 10 గుంటల స్థలంలో నిర్మించడానికి 2024అక్టోబర్ 11న శంకుస్థాపన చేశారు. ఈ సర్వే నంబర్‌లోనే గతంలో ఓ ప్రైవేట్ కంపెనీకి 11.12 ఎకలాల స్థలంలో మైనింగ్ పర్మిషన్ ఇచ్చారు. మైనింగ్ పనులకు గతంలో అధికారులు వచ్చినప్పుడు గ్రామస్తులు, చుట్టు పక్కల రైతులు సర్వేను అడ్డుకున్నారు. ఈ స్థలంలో మైనింగ్ పర్మిషన్ ఇవ్వొద్దని ఆందోళన చేపట్టారు. మైనింగ్ చేయడం వల్ల చుట్టు పక్కల ప్రాంతాల రైతుల పంట పొలాలు దెబ్బ తింటాయని, ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. భూగర్భ జలాలు, బోరు బావులు దెబ్బ తింటాయని గ్రామస్తులు ..కలెక్టర్, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపన చేసిన కొద్ది రోజులకే కంపెనీ వారు మైనింగ్ పర్మిషన్ ఉందని పనులు ప్రారంభించారు. మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలని గ్రామస్తులు ఆందోళన బాటపడుతున్నారు.

ప్రభుత్వ భవనాలు ఉన్నా..

సర్వే నంబర్ 98లోనే 2021లో రైతు వేదిక, సెగ్రిగ్రేషన్ షెడ్లు, క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించడంతో వీటిని నిర్మించారు. వీటితో పాటు 20 ఎకరాల 10 గుంటల స్థలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించడానికి శంకుస్థాపన చేశారు.అలాగే వానాకాలం, యాసంగి సీజన్లలో ఇదే సర్వే నంబర్‌లోని స్థలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దీనికి తోడు మైనింగ్ పర్మిషన్ ఇవ్వాలంటే ఇంటి నిర్మాణాలకు 2కి.మీ. దూరంలో ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం అర కిలో మీటర్ లోపే స్థానికులు ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో పాటు ఇదే స్థలంలో ప్రాచీన పురాతన దేవాలయం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మైనింగ్ పనులు రద్దు చేయాలని నెల రోజులక్రితం 42 మంది గ్రామస్తులు కలిసి హైకోర్టులో కేసు వేశారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మైనింగ్, రెవెన్యూ అధికారులు గురువారం సర్వే నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు.



తొండ గ్రామంలో మైనింగ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామసభ ఆమోదం లేకుండానే పర్మిషన్ ఇచ్చారు



ప్రత్యేక అధికారుల పాలనలో ఎలాంటి గ్రామ సభ లేకుండా, ఎవరి అభిప్రాయం తెలుసుకోకుండా మైనింగ్ పనులకు అధికారులు పర్మిషన్ ఇచ్చారు. మైనింగ్ చేయడం వల్ల రైతు వేదిక, ఇంటిగ్రేటెడ్ పాఠశాల పూర్తిగా దెబ్బ తింటుంది. మైనింగ్ పర్మిషన్ ను అధికారులు రద్దు చేయాలి.

– ఎల్లయ్య, రైతు, తొండ.

పంట పొలాలు దెబ్బ తింటాయి



మా భూమి పక్కనే ఉన్న పోరెల్ల గుట్టపై పశువులు, జీవాలు మేపుకొని జీవిస్తున్నాం. మైనింగ్ చేస్తే మా భూమిలో రాళ్ల పడి మేము వ్యవసాయం చేసుకోలేము. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంది.

– ఈరంటి సోమయ్య, రైతు.

మమ్మల్ని బెదిరిస్తున్నారు



మా భూముల్లోనే మైనింగ్ కంపెనీ వాళ్లు బాట వేస్తున్నారు. మేము అడిగితే మమ్మల్నే బెదిరిస్తున్నారు. పక్కనే ఉన్న కుంటలో పశువులు నీళ్ల తాగకుండా మోటార్లతో నీళ్ల తోడిస్తున్నారు. అధికారులు స్పందించి మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి.

– కుమార్, తొండ.

అనుమతి రద్దు చేయాలి

తొండ గ్రామంలో సర్వే నంబర్ 98లో మైనింగ్ పనులను రద్దు చేయాలని గ్రామస్తులు, రైతులు అధికారులను వేడుకున్నారు. గురువారం జిల్లా మైనింగ్, విద్యా శాఖ, రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 98లో (పూరెల్ల గుట్టపై) మైనింగ్ పనులను పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ ఈ సర్వే నంబర్‌లో అధికారులు అక్రమంగా మైనింగ్ పర్మిషన్ ఇచ్చారని, ఎలాంటి గ్రామ సభ లేకుండా గ్రామస్తులు, రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా మైనింగ్ పర్మిషన్లు ఇచ్చారని ఆరోపించారు. మైనింగ్ పనులు చేయడం వల్ల ఇంటి నిర్మాణాలు, రైతు వేదిక, ఇమిగ్రేషన్ షెడ్లు, క్రీడా స్థలాలు దెబ్బ తింటాయని చెప్పారు. రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల దెబ్బ తింటుందని, విద్యార్థులు ఇబ్బందులు పడతారని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులకు పూర్తి నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, డి.రమేష్‌కుమార్, మైనింగ్ ఆర్ఐ వసుమతి, సర్వేయర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, డిప్యూటీ తహసిల్దార్ జాన్‌మహ్మద్, సర్వేయర్ జోసఫ్, ఆర్ఐలు సుజిత్‌రెడ్డి, జార్జిరెడ్డి, గ్రామ కార్యదర్శి యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

31వరకు 'పోలీస్ యాక్ట్' అమలు : ఎస్పీ

సూర్యాపేటటౌన్ : శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు '30 పోలీస్ యాక్ట్' అమల్లో ఉంటుందని ఎస్పీ నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్‌లో అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయకూడదని సూచించారు. అనుమతులు లేకుండా ఆయా కార్యక్రమాలు నిర్వహించినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



వట్టిఖమ్మంపహాడ్ లో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చివ్వెంల (సూర్యాపేట) : తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. బుధవారం చివ్వెంల మండల పరిధిలోని సూర్యానాయక్‌తండా, వాల్యతండా, వట్టిఖమ్మంపహాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని తరలించారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. తేమశాతం 17 ఉండాలని పేర్కొన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందు వల్ల ఎక్కువ మొత్తంలో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ వెంకన్న, నిర్వాహకులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడేది ఎర్రజెండానే

గరిడేపల్లి: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడేది ఎర్రజెండా అని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో మేడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు, రైతుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ధరలు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్, సీపీఎం సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, సుందరి వీర రాఘవయ్య, బొల్లెపల్లి శ్రీనివాసు, సుందరి రమాదేవి, జుట్టుకొండ కలమ్మ, వెంకటేశ్వర్లు, నారాయణ, మట్టయ్య, వెంకయ్య, సైదులు, ధనమూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, వెంకన్న, సైదులు, జంగయ్య, వీరస్వామి, భూతం నాగరాజు, శేఖర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగించాలి

రామగిరి(నల్లగొండ): పాలిసెట్–2025 దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ కోరారు. పాలిసెట్ దరఖాస్తులకు లేట్ ఫీజుతో ఏప్రిల్ 21 చివరి తేదీగా నిర్ణయించి.. టెన్త్ ఫలితాలు ఏప్రిల్ 30న ప్రకటించడంతో విద్యార్థులు అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. మే 13న ఎంట్రెన్స్ ఉన్నందున దరఖాస్తు తేదీని పొడిగించి మరింత మంది విద్యార్థులు పరీక్ష రాసే అవకాశం కల్పించాలని అధికారులను కోరారు.

'హస్తం'లో సంస్థాగతం

గ్రామ, మండల, బ్లాక్, జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపికకు కాంగ్రెస్ కసరత్తు

- ఇప్పటికే సమన్వయకర్తలను నియమించిన టీపీసీసీ
- వారి ఆధ్వర్యంలోనే జిల్లా స్థాయి సమావేశాల నిర్వహణ
- డీసీసీ అధ్యక్ష పదవికి ముగ్గురి పేర్లు ప్రతిపాదన
- పోటీలో పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు
- 20వ తేదీ వరకు పూర్తికానున్న సంస్థాగత ఎన్నికల ప్రక్రియ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సంస్థాగత ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే సమన్వయకర్తలను టీపీసీసీ నియమించింది. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం కోసం పార్టీ సమావేశాలు జరుగుతున్నాయి. జిల్లా స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాలు ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. ఇందులో బ్లాక్ అధ్యక్షుల ఎంపికపై సమన్వయకర్తలు పార్టీ నేతలతో చర్చించారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశాలను ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి పేర్లపై ఆ సమావేశాల్లో చర్చిస్తారు. ఆ తర్వాత 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి నాయకుల సమావేశాలను నిర్వహించి గ్రామ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి పేర్లపై చర్చిస్తారు. జిల్లా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురి పేర్లను, మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఐదుగురి పేర్లను పార్టీ అధిష్టానానికి ప్రతిపాదించనున్నారు. అయితే, గ్రామ పార్టీ అధ్యక్షులను మాత్రం ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చర్యలు చేపట్టనున్నారు.

రెండు జిల్లాల్లో ఆశావహులు ఎక్కువే..

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతల్లో ఎక్కువే ఉన్నారు. ప్రస్తుత నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, రాష్ట్ర నేతలు కొండేటి మల్లయ్య, పున్నా కైలాస్‌నేత, చనగాని దయాకర్ పేర్లు పదవి ఆశిస్తున్న వారి జాబితాలో ప్రధానంగా ఉన్నాయి. ఈ నలుగురు నేతల అనుచరులు మాత్రం తమ నాయకుడికే పదవి ఇవ్వాలని ఎవరికివారు కోరుతున్నారు. మరోవైపు.. పార్టీలు మారిన వారికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వొద్దని కార్యకర్తల నుంచి డిమాండ్ వస్తోంది.

సూర్యాపేట జిల్లాలోనూ అధ్యక్ష పదవి కోసం ఐదుగురు నేతలు పోటీపడుతున్నారు. జిల్లాలో సీనియర్ నేతలతో పాటు రాష్ట్రస్థాయి పదవులు కలిగిన నేతలు కూడా అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. అందులో చకిలం రాజేశ్వర్‌రావు, తండు శ్రీనివాస్ యాదవ్, అన్నెపర్తి జ్ఞానసుందర్, ప్రస్తుత అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ ఉండగా.. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి కూడా డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది.

డీసీసీ పీఠం ఎవరికో...

ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఈసారి జిల్లా అధ్యక్ష పదవికి గట్టి పోటీ నెలకొంది. నల్లగొండ జిల్లాలో జిల్లా కాంగ్రెస్ ప్రస్తుత అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. దీంతో జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో.. పీసీసీ నియమించిన ఇద్దరు సమన్వయకర్తలైన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, మరో నేత నజీర్ అహ్మద్, సూర్యాపేట జిల్లా సమన్వయకర్త ఎమ్మెల్యే మురళీనాయక్ ఇటీవల జిల్లాల్లో సమావేశాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి గురించి పూర్తి వివరాలు సేకరించారు. ఆ జాబితాను టీపీసీసీకి పంపించనున్నారు.

20వరకు ప్రక్రియ పూర్తి

కాంగ్రెస్ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల ప్రక్రియను సమన్వయకర్తలు ఈ నెల 20వ తేదీ వరకు పూర్తిచేయాల్సి ఉంది. గ్రామ కమిటీలు, మండల కమిటీలతోపాటు బ్లాక్ కమిటీలను కూడా.. సమావేశాలు నిర్వహించి జాబితాలను టీపీసీసీకి పంపించాల్సి ఉంటుంది. ఈసారి పార్టీ విధేయులకే పదవులు దక్కుతాయని టీపీసీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సివిల్ కోర్ట్ జడ్జిగా గౌస్‌పాష బాధ్యతల స్వీకరణ



తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి గౌస్ పాషకు స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

తుంగతుర్తి : తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా ఎం.డి. గౌస్ పాష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టుల పట్ల క్షిదారులకు విశ్వాసం పెంచుతామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్ బార్ అసోసియేషన్ సభ్యుడు జడ్జి గౌస్ పాష కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్ఞాన సుందర్ మాట్లాడుతూ కోర్టు భవనానికి ప్రభుత్వం మూడు ఎకరాల 20 గుంటల భూమిని కేటాయించిందన్నారు. భవన నిర్మాణానికి రూ.29 కోట్లను అధికారులు అంచనా వేశారన్నారు. త్వరలో అడిషనల్ కోర్టు మంజూరుకు సీఎంతో పాటు డిప్యూటీ సీఎంను కలుస్తానని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కారింగుల వెంకటేశ్వర్లు ,ప్రధాన కార్యదర్శి కారింగుల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ రవికుమార్ ,ట్రెజరర్ సతీష్ ,ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రతాప్ ,సీనియర్ న్యాయవాది కుమారస్వామి, హరిచరణ్, చంద్రమౌళి ,అనిల్ పాల్గొన్నారు.

నివేదికను కలెక్టర్‌కు అందజేస్తా




విచారణ చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని అదనపు కలెక్టర్ పి. రాంబాబు తెలిపారు. ఆత్మకూర్(ఎస్)మండలం నెమ్మికల్‌లోని 75 సర్వేనంబర్ స్థితిగతులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది చేసిన అవకతవకలపై వచ్చిన ఫిర్యాదులపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 75 సర్వే నంబర్ కు సంబంధించిన పలు రికార్డులు, పహాణి ,వన్ బి,డీ ఆర్ లతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరి కిషోర్ శర్మ ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

మట్టి.. కొల్లగొట్టి!

కోదాడలో యథేచ్ఛగా మట్టిదందా

- అంతా అధికారుల కనుసన్నల్లోనే..?
- మాజీ ప్రజాప్రతినిధులే సూత్రధారులు



ఇది కోదాడ మండలం కూచిపూడి వద్ద ఉన్న సర్వే నంబర్ 615 లోని ప్రభుత్వ భూమి. గత డిసెంబర్ 28న కోదాడకు చెందిన కొందరు మట్టి వ్యాపారులు అనుమతులు లేకుండా మట్టి తవ్వుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. కోదాడ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు వచ్చి విచారణ చేశారు. ఒక పొక్లెయిన్, ఇతర వాహనాలను సీజ్ చేస్తామని, తవ్విన వారిపై చర్యలు తీసుకుంటామని, మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.ఇది జరుగుతుండగానే రాజకీయనేతలు కల్పించుకోవడంతో నామమాత్రపు జరిమానాతో నాడు వాహనాలను వదిలేశారు. మైనింగ్ శాఖ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



ఇది ఏప్రిల్ 25వ తేదీన కోదాడ మండలం కూచిపూడి వద్ద ఉన్న సర్వేనంబర్ 615లో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తుండగా జిల్లా మైనింగ్‌శాఖ, కోదాడ తహసీల్దార్ కార్యాలయ అధికారులు దాడులు చేసి ఒక పొక్లెయిన్, ఐదు టిప్పర్లను సీజ్ చేశారు. వీరు ఏకంగా మైనింగ్‌శాఖ 20 రోజులకు ఇచ్చిన అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసి రెండున్నర నెలలు అదనంగా మైనింగ్ చేస్తున్నారు. వీరిపై కూడా ఎలాంటి కేసులు లేకుండా కేవలం జరిమానాతో అధికారులు వదిలేశారు.

ఈ రెండు సంఘటనలు చూసిన తరువాత కోదాడ కేంద్రంగా సాగుతున్న మట్టిదందాలో కోదాడ రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు అర్థమవుతోంది.

కోదాడ: కోదాడ మండలం కూచిపూడి వద్ద సర్వేనంబర్ 615లో నాలుగు ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో గత ప్రభుత్వ హయాంలో నాటి నేతల అండదండలతో అక్రమంగా మట్టి వ్యాపారం చేయడం పెద్ద దుమారాన్ని లేపింది. ప్రభుత్వం మారిన తరువాత మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి, మరో మండల పార్టీ నేతల అండదండలతో మట్టిదందా జోరుగా సాగుతోంది. అధికారులు దాడులు చేసిన సమయంలో వెంటనే వీరు రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్క బెడుతుంటారు. అధికారులు, దందా రాయుళ్లకు మధ్య వీరే అన్నీ సర్దుబాటు చేస్తుంటారనే ఆరోపణలున్నాయి. నిత్యం రాబడి ఉండడంతో ఫిర్యాదులు వచ్చిన సమయంలో హడావుడి చేయడం ఆ తరవాత నామమాత్రపు జరిమానాతో సరిపుచ్చడం షరా మాములుగా మారింది.

రెవెన్యూ అధికారులదే కీలక పాత్ర

కోదాడ మండలంలో జరుగుతున్న మట్టి దందాలో రెవెన్యూ అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వానికి చెందిన ఒకే సర్వేనంబర్‌లో లక్షల రూపాయల విలువైన మట్టిని అక్రమంగా ఒకరిద్దరు వ్యాపారులే తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు జరుగుతుంటే ఇప్పటి వరకు కోదాడ రెవెన్యూ అధికారులు ఒక్క ఫిర్యాదు కూడా చేయలేదు. అది మైనింగ్‌శాఖ చూసుకోవాలని చెబుతున్నారు. మైనింగ్ లీజుకు ఇచ్చిన ప్రదేశంలో అక్రమ తవ్వకాలు జరిగితే మేము చర్యలు తీసుకుంటాము, ఇతర ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిగితే మాకు సంబంధం లేదని మైనింగ్‌శాఖ అధికారులు అంటున్నారు. అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు తమకు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం.. అది మైనింగ్.. రెవెన్యూశాఖలకు సంబంధించిన వ్యవహారం అని వారు తప్పించుకుంటున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి కలెక్టర్.. మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేయకుండా..

గత నెల 25న కోదాడ మండలం కూచిపూడి వద్ద జరిగిన అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేయడానికి మైనింగ్‌శాఖ జిల్లాస్థాయి అధికారి కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆయనకు పోలీసులు సహకరించకపోవడంతో ఇలా పోలీస్ స్టేషన్ బయట కింద కూర్చొని ఫిర్యాదు రాసుకోవాల్సి వచ్చింది. ఇక కొందరు రాజకీయ నాయకులతో పాటు అధికారులు కూడా ఆయన ఫిర్యాదు చేయకుండా తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. మధ్యాహ్నం స్టేషన్‌కు వచ్చిన ఆయనతో పోలీస్ అధికారులు రాత్రి 9-30 గంటల వరకు ఫిర్యాదు తీసుకోలేదని సమాచారం. అన్ని వైపుల నుంచి ఆయనపై ఒత్తిడి తేవడంతో ఆయన ఫిర్యాదు చేయకుండా అక్కడి వారు చెప్పినట్లు కేవలం జరిమానా విధించి వెళ్లిపోయారని తెలిసింది.



ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన మైనింగ్ అధికారి(ఫైల్)

విచారణ చేస్తాం

కోదాడ మండల పరిధిలోని సర్వే నంబర్ 615లో కొందరు అక్రమంగా మట్టి తవ్విన విషయం మా దృష్టికి కూడా వచ్చింది. మైనింగ్‌శాఖ అధికారులు జరిమానా విధించారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా మట్టి తవ్వితే కఠిన చర్యలుతీసుకుంటాం. 615 సర్వే నంబర్‌పై విచారణ చేస్తాం.

– సీహెచ్. సూర్యనారాయణ, కోదాడ ఆర్డీఓ

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన లచ్చిమల్ల లక్ష్మయ్య(41) బైక్‌పై గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తుండగా అప్పన్నపేట గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య గతంలోనే చనిపోయింది. లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మయ్య తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత


పోలీసులు పట్టుకున్న పశువులు

చౌటుప్పల్ రూరల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పశువులను గురువారం చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట సంతలో కొనుగోలు చేసిన 12 ఎద్దులు, రెండు ఆవులను ఆటోలో హైదరాబాద్‌లోని బహదూర్‌పూరాలో గల కబేళాకు తరలిస్తుండగా.. చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు గుర్తించారు. ఈ మేరకు తునికి చెందిన ఆటో డ్రైవర్ యలమంచిలి అప్పలరాజు, జగ్గంపేటకు చెందిన అవాల నూకరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

బీబీనగర్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కూనూరు దుర్గాప్రసాద్(20) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి దుర్గాప్రసాద్ కాటేపల్లి గ్రామానికి బైక్‌పై వస్తుండగా.. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం వెనుక బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ బైక్ పైనుంచి ఎగిరిపడి ఫ్లైఓవర్ గోడకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువు కూనూరు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

మర్రిగూడ: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివన్నగూడ గ్రామానికి చెందిన ఐతరాజు సత్తయ్య, రాములమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. రెండో కుమారుడు ఐతరాజు మహేష్(32) మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మహేష్ తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మహేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రాణి, కుమార్తె ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపారు.

సుందరీమణుల రాక కోసం..

- ముస్తాబవుతున్న సాగర్‌లోని బుద్ధవనం, పోచంపల్లిలోని టూరిజం పార్కు
- చేనేత థీమ్ ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


పోచంపల్లిలోని టూరిజం పార్కు


రంగులు వేస్తున్న పెయింటర్లు

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్ వేదికగా ఈ నెల 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు పోచంపల్లితో పాటు నాగార్జునసాగర్‌ను సందర్శించనున్నారు. వారి రాక కోసం సాగర్‌లోని బుద్ధవనం, పోచంపల్లిలోని టూరిజం పార్కు తదిత పర్యాటక ప్రాంతాలను అధికారుల ప్రత్యేంగా ముస్తాబు చేస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే 140 దేశాలకు చెందిన సుందరీమణులను బృందాలుగా విభజించి తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన వారసత్వ ప్రదేశాలు, దేవాలయాలు, ప్రముఖ పర్యాటక కేంద్రాలను సందర్శించే విధంగా అధికారులు రూట్‌మ్యాప్ తయారు చేశారు. అందులో భాగంగానే ఈ నెల 15న సుమారు 40దేశాలకు చెందిన అందాల భామల బృందం పోచంపల్లిని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో గత 10 రోజులుగా ఇక్కడి టూరిజం పార్కులోని ఇంటీయర్‌తో పాటు బయటి ప్రాంగణమంతా రంగులు వేస్తూ సుందరీకరణ చేస్తున్నారు. మ్యూజియం, హాప్లి థియేటర్, గెస్ట్ రూంలను అందంగా అలంకరిస్తున్నారు.


చేనేత సంస్కృతి ఉట్టిపడేలా..

పోచంపల్లికి వచ్చే అందాల భామలకు చేనేత థీమ్ ప్రతిబింబేలా అధికారులు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. పది రోజుల క్రితం అప్పటి పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ పోచంపల్లి టూరిజం పార్కును సందర్శించి అధికారులకు, ఈవెంట్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అందుకనుగుణంగా చేనేత మ్యూజియంలోని గోడలకు పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, నారాయణపేట, గద్వాల వస్త్రాలతో అలంకరించనున్నారు. అంతేకాక టూరిజం ప్రాంగణంలో ఆయా చేనేత వస్త్రాల తయారీ విధానాలను లైవ్ డెమాన్‌స్ట్రేషన్‌తో పాటు చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్థానిక మహిళలచే అందాల భామలకు ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. హాంప్లి థియేటర్ వద్ద నిర్వహించే చేనేత కార్మికుల ముఖాముఖి కార్యక్రమంలో కనీసం మూడు వందల మంది స్థానికులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే స్థానిక యువతులచే చేనేత ఇక్కత్ వస్త్రాలను ధరించి ర్యాంప్‌వాక్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు గంటల పాటు ప్రోగ్రాం..

15వ తేదీ ఉదయం యాదగిరిగుట్ట నరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం సుందరీమణులు సాయంత్రం పోచంపల్లికి వస్తారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఇక్కడ సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. వారం క్రితం టూరిజం అధికారులు యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి రూట్లలో టూరిజం బస్సులను నడిపి రోడ్డు మార్గం ఎలా ఉందని ట్రయల్ రన్ నిర్వహించారు.

సుందరంగా బుద్ధవనం



నాగార్జునసాగర్: మరో అందాల భామల బృందం ఈ నెల 12న బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని నాగార్జునసాగర్‌ను సందర్శించనున్నారు. ఇందు కోసం గత నెల రోజులుగా సాగర్ తీరాన గల విజయవిహార్ అతిథి గృహం, బుద్ధవనంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుద్ధవనంలో పచ్చదనంతో కూడిన ప్రకృతి అందాలు ఇనుమడింపజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బుద్ధవనం ప్రవేశ ద్వారం నుంచి మహాస్థూపం వరకు విద్యుత్ వెలుగులతో చూపరులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. తపోవనం, స్థూపవనం, జాతక మార్పు తదితర ప్రదేశాలను అన్నింటిని పరిశుభ్రం చేశారు. విదేశీయులు కాసేపు సేదతీరేలా విజయవిహార్‌ను ఆధునీకరిస్తున్నారు. ఏర్పాట్లను చూసేందుకు వారానికి ఓమారు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షలు సైతం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే గురువారం ఐజీ, జిల్లా ఎస్పీతో కలిసి సాగర్‌ను సందర్శించారు.

1500 మంది పోలీసులతో పటిష్ట భద్రత

- మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ


బుద్ధవనంలో ఏర్పాట్లపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో చర్చిస్తున్న ఐజీ సత్యనారాయణ

నాగార్జునసాగర్: బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఈ నెల 12న నాగార్జునసాగర్ సందర్శనకు ప్రపంచ సుందరీమణులు రానున్న నేపథ్యంలో 1200 నుంచి 1500 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ అతిథి గృహం, బుద్ధవనాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌ను 30 నుంచి 40 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ బృందం ముందుగా విజయవిహార్ అతిథి గృహానికి చేరుకుని అక్కడి నుంచి బుద్ధవనం సందర్శనకు వెళ్తారని పేర్కొన్నారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో ధ్యానం చేసి జాతకవనంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. సుమారు మూడున్నర గంటల పాటు మిస్ వరల్డ్ పోటీదారులు సాగర్‌లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా నిరసనలకు దిగి ఈ పర్యటనకు అంతరాయం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సమాచారం

కాలుష్య రహిత చెరువులుగా మార్చాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


శ్రీధర్‌ను అభినందిస్తున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: నానో పార్టికల్స్ సహాయంలో నీటిలోని పెస్టిసైడ్స్‌ను తొలగించి నీటిని కాలుష్యరహితంగా మార్చి చెరువుల్లో ఉండే జీవ రాశులను కాపాడేందుకు కృషి చేయాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీలో రీసెర్చ్ స్కాలర్ వి.శ్రీధర్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. ప్రశాంతి ఆధ్వర్యంలో 'కిటాలసిస్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆక్సైడ్ నానో పార్టికల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన శ్రీధర్‌ను వీసీ చాంబర్‌లో వీసీ, రిజిస్ట్రార్ అల్వాల రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు వసంత, రూప, రమేష్, జ్యోతి, కళ్యాణి, శ్రీధర్‌రావు, శంకరాచారి, అమరేందర్, తిరుపతి, అభిలాష, శ్వేత, మహతి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ఒకటవ, మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూ నివర్సిటీ పరిధిలో బీఈడీ ఒకటవ, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ గురువారం విడుదల చేశారు. ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని, విద్యార్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సీఓఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ శాస్త్రీయ సదస్సుకు ఎంపిక


ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న రాంచందర్‌గౌడ్

నల్లగొండ టూటౌన్: నానో సాంకేతికత, జీవరసాయన శాస్త్ర పరిశోధనల్లో విశేష కృషి చేసిన మహాత్మా గాంధీ యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. రాంచందర్‌గౌడ్ మలేషియాలో జూన్‌లో జరిగే అంతర్జాతీయ శాస్త్రీయ సదస్సుకు ఎంపికయ్యారు. 'నానోకణాలు, జీవ అణువుల మధ్య జీవ భౌతిక పరస్పర చర్యలు' అనే అంశంపై రాంచందర్‌గౌడ్ రచించిన పరిశోధనా వ్యాసాన్ని ఈ సదస్సులో పాల్గొని వివరించనున్నారు. ఆయన పరిశోధనలు మానవ ఆరోగ్యాన్ని మెరుగుపర్చే దిశగా, నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా ఉన్నట్లు యూనివర్సిటీ ప్రొఫెసర్లు తెలిపారు. రాంచందర్‌గౌడ్‌కు వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి అభినందనలు తెలియజేశారు.

'మట్టికాళ్ల ముట్టడి' పుస్తకావిష్కరణ


కస్తూరి ప్రభాకర్ రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, గోరటి వెంకన్న, ఓయూ ప్రొఫెసర్ కాసీం తదితరులు

మిర్యాలగూడ: ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కస్తూరి ప్రభాకర్ పదవీ విరమణ సందర్భంగా గురువారం మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రాసిన 'మట్టికాళ్ల ముట్టడి' పుస్తకంతో పాటు మధనం, ప్రభాకర చలనం పుస్తకాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్‌నాయక్, గోరటి వెంకన్న, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ తదితరులు ఆవిష్కరించారు. ప్రభాకర్ కవిగా, రచయితగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అనేక సేవలు అందించారని, ఉద్యోగ విరమణ తర్వాత కూడా తన సేవలను కొనసాగించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ప్రముఖ కార్టూనిస్ట్ నర్సింహ, మాజీ జెడ్పీ చైర్మన్ సీడీ. రవికుమార్, మానవ హక్కుల వేదిక నాయకుడు పి. సుబ్బారావు, భువనగిరి ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, సాహితీవేత్తలు ఉప్పల పద్మ, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, పందుల సైదులు, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరు బాలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిత్యాదాయం రూ.32,67,774 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


ఆలయ ముఖ మండపం క్యూలైన్‌లో భక్తులు

బరిసె మెడపై కోసుకుపోయి వ్యక్తి దుర్మరణం

దంతాలపల్లి: ప్రమాదవశాత్తు పామాయిల్ చెట్టును చెక్కే బరిసె గొంతుకు కోసుకుపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనకుంటతండా గ్రామానికి చెందిన బానోత్ రమేష్(40) తన భార్య సునీతతో కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం వచ్చారు. ఆ గ్రామానికి చెందిన పెల్లి దామోదర్‌రెడ్డి తన పామాయిల్ తోటలో పనిచేయడానికి బరిసెను పదును పెట్టించుకుని ద్విచక్ర వాహనంపై పెట్టుకుని ఇంటికి తీసుకెళ్తున్నాడు. గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఎదురుపడ్డాయి. ఎదురుగా వస్తున్న రమేష్(40) గొంతుకు బరిసె కోసుకుపోవడంతో బైక్ పైనుంచి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని రమేశ్ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రమేశ్‌కు ఇద్దరు కుమార్తెలు దీప్తి, దీపిక ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

రమేశ్ మృతి విషయం తెలుసుకున్న తండావాసులు మృతదేహాన్ని దామోదర్‌రెడ్డి ఇంటి ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. తొర్రూరు సీఐ గణేష్, దంతాలపల్లి ఎస్ఐ, నర్సింహులపేట ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన


చిట్యాల: పెద్దకాపర్తిలో నర్సరీని పరిశీలిస్తున్న సృజన, కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాల: ఉపాధి హామీ కూలీలకు రోజువారీగా వేతనం గిట్టుబాటు అయ్యేలా అధికారులు పనులు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని తిరులనాథస్వామి ఆలయ గుట్టపై ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన కందకం తవ్వకం పనులు, వన నర్సరీలను గురువారం ఆమె జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు, రోజుకు వస్తున్న వేతన వివరాలు, సమస్యలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో నీడనిచ్చే, పండ్ల మొక్కలను పెంచాలని సూచించారు. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో తాము సొంత డబ్బులతో పనులు చేయాల్సి వస్తోందని ఆమెకు పలువురు కార్యదర్శులు వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య, తహసీల్దార్ క్రిష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, ఏపీఓ శ్రీలత, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను నిర్లక్ష్యం చేయొద్దు

నార్కట్‌పల్లి: ఉపాధి హామీ పనులను నిర్లక్ష్యం చేయకుండా పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన అన్నారు. నార్కట్‌పల్లిలో ఉపాధి పనులు, కంపోస్ట్ షెడ్, బ్రాహ్మణ వెల్లంలలో బృహత్ పల్లె ప్రకృతి వనం, మాదవ ఎడవల్లిలో పామ్‌పాండ్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. అడిషనల్ పీడీ నవీన్, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్, ఏపీఓ యాదయ్య, కార్యదర్శులు ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నల్లగొండ వన్ టౌన్, సీసీఎస్ పోలీసులు గురువారం నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ చౌరస్తా వద్ద అరెస్ట్ చేశారు. వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కాకినాడకు చెందిన ధర్మాడి దుర్గాప్రసాద్, కాకినాడ జిల్లా తడలరేవు మండలం గాడిమొగ్గ గ్రామానికి చెందిన పాసిల సత్యనారాయణ, అదే గ్రామానికి చెందిన కామాడి శ్రీనివాస్ ముఠాగా ఏర్పడి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. వీరు 2024 అక్టోబర్‌లో కాకినాడ నుంచి రైలులో నల్లగొండకు వచ్చి పట్టణంలోని అల్కాపురి కాలనీకి చెందిన పాశం జనార్దన్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడి 2 బంగారు చైన్లు, రూ.40వేలు నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా 2024 డిసెంబర్‌లో నల్లగొండ పట్టణంలోని మహిళా ప్రాంగణం వద్ద నివాసముంటున్న బోయిని కరుణాకర్ ఇంటి ముందు పార్కింగ్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగిలించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో దొంగిలించిన పల్సర్ బైక్‌పై కాకినాడ నుంచి నల్లగొండకు వచ్చి అక్కలాయిగూడెం ప్రాంతంలో నివాసముంటున్న జెట్టి నాగరాజు ఇంట్లో 12 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి కాళ్ల కడియాలు, రూ.1,25,000 నగదు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరిలో పాసిల సత్యనారాయణ, కామాడి శ్రీనివాస్‌ను నల్లగొండ వన్ టౌన్ పోలీసులు నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 గ్రాముల బంగారు గొలుసు, పల్సర్ బైక్, 50 తులాల వెండి కాళ్ల కడియాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ధర్మాడి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ధర్మాడి దుర్గాప్రసాద్‌పై 50 చోరీ కేసులు, పాసిల సత్యనారాయణ మీద 16 చోరీ కేసులు, కామాడి శ్రీనివాస్‌పై 3 కేసులు తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల పరిధిలో నమోదైనట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీసీఎస్ సీఐ డానియల్ కుమార్, ఎస్ఐ శివకుమార్, సిబ్బంది విష్ణు, నల్లగొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ గోపాల్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, శ్రీకాంత్, అంజాద్, గాంధీని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

పార్థీ గ్యాంగ్ సభ్యులకు జైలుశిక్ష

రామగిరి(నల్లగొండ): మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ పార్థీ గ్యాంగ్ సభ్యులకు ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె. శిరీష గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన అప్పా పాండురంగ పవార్, దిల్దార్ అశోక్ పవార్ నల్ల గొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్‌తో పాటు రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో, సంగారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 65పై రాత్రివేళ వాహనాలు ఆపి నిద్రిస్తున్న వారిని కిరాతకంగా రాళ్లతో కొట్టి వారి వద్ద నుంచి విలువైన బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్నారు. అడ్డుకున్న కొందరిని హత్య చేశారు. వీరిపై నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 32 కేసులు నమోదయ్యాయి. మరికొన్ని కేసుల్లో వీరికి జైలు శిక్ష ఖరారయ్యింది. 2024 జూన్ 17న చిట్యాల పట్టణంలోని భువనగిరికి వెళ్లే రోడ్డులో నివాసముంటున్న కంబాలపల్లి అండాలు, ఆమె భర్త స్వామి ఇంటి బయట నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి అండాలు మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును వీరు దొంగిలించారు. మరుసటిరోజు బాధితురాలు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. నిందితులను పోలీసులు పట్టుకుని సరైన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. క్రిష్ణయ్య వాదనలతో ఏకీభవించిన జడ్జి కె. శిరీష నిందితులకు 18 నెలలు జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే మరో నెల రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించి నిందితులకు శిక్ష పడేలాచేసిన చేసిన నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, ఎస్ఐ డి. సైదాబాబు, ఎస్ఐ ఎన్. ధర్మా, కోర్టు కానిస్టేబుల్ ముత్తిలింగం, కోర్ట్ లైజనింగ్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

కులగణనపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని కేసీఆర్ అనడం సరైంది కాదు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వివిధ రాష్ట్రాల్లో సామాజిక నేపథ్యాల కారణంగా కులాల రిజర్వేషన్ అమల్లో ఉందని, ఈ అంతరాన్ని ఎలా తొలగిస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. ముందుగా కుల గణన చేపట్టిన తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. గురువారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నియోజక వర్గాల పునర్విభజన అమలు చేస్తామని హామీనిచ్చిన కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల విషయంలో సవతి తల్లి ప్రేమను చూపుతోందన్నారు.

సోనియా లేకుండా తెలంగాణ వచ్చేది కాదు..

తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనడం అర్థరహితమన్నారు. కేసీఆర్ స్వయంగా ఎన్నోసార్లు సోనియాగాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ విషయంలో కేసీఆర్ పోరాటాన్ని కూడా కాదనలేమన్నారు. అందుకే ప్రజలు పదేళ్ల అధికారాన్ని కూడా ఇచ్చారన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో కేసీఆర్ పాత్ర, సోనియాగాంధీ పాత్ర, సుష్మా స్వరాజ్ పాత్రను విస్మరించలేమన్నారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తవుతుంది..

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు విషయంలో ఎటువంటి అనుమానం వద్దని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో పూర్తవుతుందన్నారు. టన్నెల్ ప్రమాదం వల్ల కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉందని కానీ, ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిపుణులు ఏవిధంగా పూర్తి చేయాలనేది చెప్పాల్సి ఉందన్నారు. వెలుపలి నుంచి ప్రాజెక్టు చేపడితే పర్యావరణ అనుమతులు అవసరం కాబట్టి కేంద్ర సహకారం కూడా ప్రాజెక్టు పూర్తి అవసరం ఉందని గుత్తా చెప్పుకొచ్చారు.

ఏఎమ్మార్పీ కాలువ పెంచాలి..

ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్ లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.442 కోట్లు ఇచ్చిందని సుఖేందర్‌రెడ్డి చెప్పారు. కెనాల్‌లో 4వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుందని, లైనింగ్ పనులు పూర్తయితే పెరుగుతుందన్నారు. కాబట్టి కాలువను రెండు మీటర్ల వెడల్పు పెంచి లైనింగ్ పనులు చేస్తే మేలు జరుగుతుందని, ఈ విషయంలో మంత్రి ఉత్తమ్ ఆలోచించాలన్నారు.

ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి

పాకిస్తాన్‌తో యుద్ధం కంటే ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే ప్రథమ కర్తవ్యమని సుఖేందర్‌రెడ్డి అన్నారు. పాకిస్తాన్ తమ భూభాగంలో ఉన్న ఉగ్రవాదులను అప్పగిస్తే కొంతవరకు ఉద్రిక్తతను అరికట్టవచ్చన్నారు. పాకిస్తాన్ మంత్రుల ప్రకటనలను చూస్తే పరిష్కారం దిశగా లేవని కవింపు చర్యలుగా ఉన్నాయని గుత్తా పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయి, ఉగ్రవాద దేశంగా పేరుపడిన పాకిస్తాన్ యుద్ధం కోరుకుంటే తన చావును తాను కొని తెచ్చుకోవడమేనని అన్నారు.